
# ఏది నిజం?

టి. సుధీర్‌బాబు




ఊరి బయట నిర్జన ప్రదేశం. ఒంటరి నక్షత్రంలాంటి బంగ్లా!!

నడి రాత్రికి ఇంకా కొద్ది సమయం ఉంది. అలాగే ఈ కథ ప్రారంభానికి కూడా ...

ఆ సంగతి చల్లగాలికి ముందే తెలిసినట్టుంది. అప్పటిదాకా మామూలుగా వీచిన గాలి కాస్తా రాక్షసరూపం దాల్చింది.

ఆ రూపానికి వికృతంగా నవ్వుని సమకూర్చినట్టు ఉరుము ఉరిమింది.

నల్లగా ఒత్తుగా ఉన్న జుత్తుని నవరంలో మరింత సింగారించినట్టు ఆ నల్లని మబ్బుల మధ్య మెరుపు. ఆ వాతావరణం ఎంత భయానకంగా ఉందో ప్రపంచానికి ఒక్క క్షణం చాటింది.

ఆ రాత్రిలో, ఆ గాలిలో, ఆ కరడు కట్టిన పైశాచిక బీభత్సంలో ఒక ఆకారం బంగ్లా బయటకు వచ్చింది.

ఆ ఆకారం ...

***

*మనోహర్ చెప్పిన కథ*


నా గురించి చెప్పుకోవడం కంటే .... నా కుటుంబం గురించి చెప్పడమే ఉత్తమం. మాది మధ్యతరగతి కుటుంబం. నాకు ఆరు, ఏడు ఆ మధ్య వయసు ఉన్నప్పుడే తల్లిదండ్రుల్ని కోల్పోయాను. నాకు అది ఎంత పెద్ద దెబ్బో మీకు అర్థమయిందనుకుంటాను. కానీ నాకంటే పెద్ద దెబ్బ తగిలిన రెండవ మనిషి, కాదు .... కాదు మొదటి మనిషనే చెప్పాలి. ఆ మొదటి మనిషి నా చెల్లెలు. తనకి అప్పుడు మూడేళ్లు. మొదటి మనిషని ఎందుకన్నానంటే తల్లిదండ్రుల అవసరం అప్పుడు నాకంటే ఆ వయసు పిల్లకే ఎక్కువ. దూరపు బంధువు ఒకామె మా ఇద్దరి మీదా జాలితోనో, ప్రేమతోనో సాకింది. ఆమె ప్రేమతో, బంధువుల జాలివల్ల, కాలం అనూహ్యంగా పరుగెత్తడం వల్ల మేం పెరిగి పెద్దయ్యాం. మాకున్న ఆ పెద్ద దిక్కుని కూడా కాలం తన గతంలో కలిపేసుకుంది. మళ్లీ ఒంటరివాళ్లం అయ్యాం. కాకపోతే కొంతలో కొంత ఊరట నేను ఉన్నా నా చెల్లెలికి పెద్దగా. నాకు ఓ ఉద్యోగం ఉంది తోడుగా.

నా ఉద్యోగం చిన్నదే అయినా నా చెల్లెలికి ఏ లోటూ రాకుండా చూశాను. ఎందుకంటే ఈ

భూమ్మీద నాకున్న ఒకే ఒక రక్తసంబంధం అది.

దానికి దెబ్బ తగిలినా, జ్వరం వచ్చినా అల్లాడిపోయేవాడిని. రేయి, పగలు ఒకటే ధ్యాస - దాని ఆరోగ్యం.

ఇంతలా హడావుడి పెట్టే తను కోలుకున్నాక అడిగేది "అన్నయ్యా! నేను కూడా పోతే?" అని అర్థోక్తిగా ఆపేది.



నా కళ్లలో నీళ్లు తిరిగేవి.

అది చూసి తను భరించలేక ఆ వాతావరణాన్ని తేలిక చేస్తూ, "నేను లేకపోతే అంటే ... నాకు పెళ్లయి వెళ్లిపోతే అని ..." ఉడికించేది.

నేను వేలు చూపించి బెదిరిస్తే మళ్లీ తనే అనేది "నిజం, అన్నయ్యా! నేను కూడా నిన్ను విడిచి ఉండలేను. ఒకవేళ నాకు పెళ్లయి నాలో స్వార్థం పెరిగిపోతే ... అసలు ఆ ఊహ కూడా భరించలేకుండా ఉన్నాను. నాకు పెళ్లి వద్దు!" అని కళ్లనీళ్లు పెట్టుకునేది.

అటువంటి నా చెల్లెల్ని ... నా చెల్లెల్ని ....

నేను చెబుతుంటేనే సెగతో ఎగసిపడే నిప్పుకణాల్లా నాలో రక్తం ... బిందువు బిందువులుగా వేడిగా వాడిగా ఉప్పెనలా శరీరంనుండి విరుచుకు పడుతున్నాయి.

అలాంటిది ఆ సంఘటన జరిగినప్పుడు నా శరీరం ఎంత యాతన పడిందో?!

ఆ రోజు ....

ఆ రాత్రి ...

నా చెల్లెలు కాలేజీ నుండి తిరిగి రాలేదు.

చీకటి పడ్డ కాసేపటివరకూ మనసులో ఆందోళనని తొక్కిపెట్టా 'ప్రైవేటు క్లాసు ఉండి ఆలస్యం అయి ఉంటుందని'. కానీ సమయం పెరిగే కొద్దీ ఆందోళన నన్ను భూమ్మీద నిలువనివ్వలేదు.

దాని కాలేజీకి వెళ్లా. వాచ్‌మన్ అందరూ ఎప్పుడో వెళ్లిపోయారన్నాడు. నాలో ఆశ చావలేదు. ఆ వాచ్‌మన్‌ని విసిగించి, కాళ్లా వేళ్లా పడి తలుపులు తీయించి ఆ కాలేజీ అంగుళం అంగుళం వెతికా. ఎక్కడా కనపడ్లేదు.

నా చెల్లెలి ఫ్రెండ్సింటికి, పరిచయం ఉన్న వాళ్లింటికి - అదని లేదు, ఇదని లేదు .... నా ఆశ వెతికించినచోటల్లా వెతికాను. ఎక్కడా ఆచూకీ లేదు.

నా బాధ గమనించిన ఇద్దరు లెక్చరర్స్ వెంట రాగా, పోలీసు రిపోర్టిచ్చాను.

రోజు గడిచింది.

ఫలితం లేదు.

నిద్ర లేదు .... ఆకలి లేదు ....

రెండోరోజు సాయంకాలానికి పోలీసులొచ్చారు. ఓ బాడీని ఐడెంటిఫై చెయ్యాలన్నారు. వెంట రమ్మన్నారు. దారంతా ప్రార్థించాను. నా చెల్లెలికి ఏమీ కాకూడదని ...

నా ప్రశ్నలకి, ఆందోళనకి పోలీసులు ఏ సమాధానం చెప్పలేదు.

మేం వెళ్తున్న వాన్ ఊరు దాటింది. నిర్జన ప్రదేశంలో వాన్‌ని ఆపారు. రోడ్డుకి పక్కగా. మైదానంలో కొంత దూరం నడిచాం. కన్నీళ్లు ధారగా కారుతున్న నా కంటికి .... కళ్లకి మసక మసకగా ఆ దృశ్యం ..... ఓ చెట్టు. దానికి ఉరిపోసుకుని వేలాడుతున్నట్టు ఓ స్త్రీ శరీరం. కాపలాగా ఇద్దరు పోలీసు కానిస్టేబుళ్లు.

ఆ చెట్టు దగ్గరకొచ్చేవరకూ నాతో ఉన్న ప్రార్థనలు, ఆశలు ఆ చెట్టు దగ్గరికి రాగానే ఉన్నట్టుండి ఆవిరైపోయాయి.

ఏం కాకూడదనుకున్నానో అదే నా కళ్లముందు

నా బంగారంలాంటి చెల్లెలు ....

నా తోడు .... నా రక్తసంబంధం అయిన నా చెల్లెలు .... ఇక ఇప్పుడు లేదు.

నా ప్రేమ - మృత కళేబరంలా ఆ చెట్టుకి ఊగిసలాడుతోంది.

ఐడెంటిఫికేషన్ పూర్తయ్యాక, పోలీసుల ఫార్మాలిటీస్ అన్నీ పూర్తయ్యాక, కేసు కూడా క్లోజ్ అయింది ఆత్మహత్యగా.

నాకు ఇంకేం మిగలలేదు దాన్ని కప్పేసిన మట్టి తప్ప! నా చెల్లెలిది ఆత్మహత్య కాదు అన్న అనుమానం తప్ప.

ఉద్యోగం వదిలేశాను.

నా అనుమానానికి ఆధారంకోసం పిచ్చిపట్టినట్టు తిరిగాను. తీగ లాగాను. డొంక కదిలింది ... నా చెల్లెలి ఫ్రెండ్స్ రూపంలో. వాళ్లు అయినా అనుమానంగా చెప్పారు.

నరసింహం అని ఓ జులాయి వెధవ నా చెల్లెల్ని రెండు మూడు సార్లు ఏడిపించడం చూశామని. మనిషి పోలికలు, వాడి కారు కలరు అస్పష్టంగా చెప్పారు. అది చాలు నాకు.

వివరాలు ఒక్కొక్కటిగా బయటకొచ్చాయి.

నరసింహం తండ్రి ఓ కాంట్రాక్టరు. ప్రస్తుతం మంత్రిగా చేస్తున్నాడు. డబ్బుని వెనకా ముందూ చాలా కూడబెట్టాడు.

తండ్రి కాంట్రాక్టులు చేస్తున్నప్పుడే నరసింహానికి పట్టపగ్గాలు లేవు. ఆయన మంత్రికూడా అయ్యాక నరసింహాన్ని అడ్డుకునే సాహసం ఎవరికీ లేకుండా పోయింది.

ఈ అనర్థానికే నా చెల్లెలు బలయ్యింది. ఇంత తెలిశాక కూడా అతడి బలం, బలగం నన్నేమీ ఆపలేకపోయాయి. అతడి బంగ్లాలోనే అతడ్ని నిలేశాను.

ఫలితం అతని మనుషులచేత తరమబడ్డాను, వెంటాడబడ్డాను, వేటాడబడ్డాను.

మార్గం సరి అయినది కానప్పుడు ఎటువంటి దెబ్బ తినాల్సివస్తుందో అనుభవపూర్వకంగా అర్థమైంది.

ఇప్పుడు అలా కాదు. సరైన మార్గం ఎంచుకున్నాను.

ఆ మార్గం పేరు సు...వ...ర్చ...ల!

***

*సువర్చల చెప్పిన కథ*

నా గురించి ఎవరికైనా చెప్పాలంటే అఫ్‌కోర్స్ ... నా గురించి నేను ఎవరికీ చెప్పకుండానే తెలుస్తుంది. నేను నేనుగా తెలిసే ఆ వర్చస్సు - నా చిన్నప్పుడు అయితే డబ్బు.

మా అమ్మా, నాన్నలకున్న డబ్బు నా గురించి లోకానికి నేను చెప్పకుండానే తెలిసేట్లు చేసింది.

అదే ఇప్పుడైతే నా గురించి తెలియాలంటే కేవలం రెండు పదాలు చెబితే చాలు!

అవి అందం ప్లస్ డబ్బు!

ఇక నా గురించి నేను చెప్పుకునేది ఏమీ లేదు. ఏ బాధలు, భయాలూ లేకుండా పెరిగినదాన్ని అని చెప్పడం తప్ప. ఆ.... వెయిట్.... వెయిట్.... భయం అంటే గుర్తొస్తుంది. ఈమధ్యే ఓ థ్రిల్లింగ్ సంఘటన జరిగింది. ఈమధ్యే అంటే ఖచ్చితంగా మూడు రోజుల క్రితం .... సరిగ్గా అమ్మా నాన్నలు పదిరోజుల బిజినెస్ ట్రిప్‌కోసం సింగపూర్ బయలుదేరుతున్న రోజు. ఇంట్లో ఒకటే హడావుడి .... వాళ్ల ప్రయాణం అనే కాదు, నాకు కూడా ఆ రోజు ముఖ్యమైన పని ఒకటి ఉంది. పని అంటే ... నా ఫ్రెండ్ భద్రావతి పెళ్లికి వెళ్లాల్సి ఉంది. అంది తప్పనిసరిగా నేను అటెండ్ అవ్వాల్సిన ఫంక్షన్. నాన్నేమో "మాకు సెండాఫ్ ఇవ్వవా?" అని బుంగమూతి పెట్టాడు.

"సెండాఫ్ ఇవ్వకుండా మీరెలా వెళ్తారు డాడీ? ముహూర్తం అవ్వగానే కారు తీసుకుని సరాసరి ఎయిర్‌పోర్టుకి వచ్చేస్తాను. అప్పుడు దానికీ హేపీ, మీకూ హేపీ! సరేనా?"

నాకు ఎదురు చెప్పలేదు "రాత్రిపూట, జాగ్రత్త తల్లీ!" అని మాత్రం అన్నారు. అమ్మ మాత్రం వణుకుతూనే ఉంది "ఆడపిల్లవి .... ఒక్కదానివీ ..." అని.

"ఎంతమ్మా.... ఇరవై కిలోమీటర్లు కూడా లేదు! పైగా, వెళ్లలేదంటే అది నన్ను జీవితాంతం దెప్పుతూనే ఉంటుంది. ప్లీజ్..... ప్లీజ్....!"

అమ్మ కూడా మెత్తబడింది.

ఆ రాత్రి పెళ్లి బ్రహ్మాండంగా జరిగింది.

నేను రిటన్ అయ్యాను. ఊరు ఇంకా రెండు మూడు కిలోమీటర్లు ఉందనగా జరిగిందా సంఘటన.

కారు ఉన్నట్టుండి ఒక్క కుదుపుతో ఆగింది.

ఐదు...పది .... పదిహేను నిమిషాలు గడిచాయి. నా ప్రయత్నం ఫలించలేదు. కారు ఎంతకీ కదలలేదు. చేసేదేమీ లేక దిగాను.

చీకటి, పైగా నిర్మానుష్యం. అప్పుడప్పుడూ విసురుగా గాలి. ఎంతటి గుండెధైర్యం కలవాళ్లకైనా దడ పుట్టించే వేళ అది. దేవుడు, దయ్యాలు .... నాకు అలాంటి నమ్మకాలు లేవు. కానీ ఏ మూలో నన్నని అదుర్దా. లిఫ్ట్ కోసం ట్రై చేద్దామని నిల్చున్నా. రోడ్డుకి కొద్ది దూరంలో మిణుగురు పురుగుల్లా లైట్లు వెలుగుతున్న బంగ్లా.

ధైర్యం, ఉత్సాహం రక్తంలాగా నాలో ప్రవహించాయి. సహాయం అడుగుదామని అటువైపు నడిచాను. బంగ్లాముందు కూడా ఎవరూ లేరు. గేటుని కిర్రుమంటూ తోసుకుంటూ వెళ్లాను. వరండాలో పెద్ద రాకర్ చైర్‌లో ఊగుతూ అటువైపు ముఖంపెట్టి ....

"హలో..." నా గొంతులో నాకే తెలియనంత వణుకు.

ఆ చైర్ ఊగడం ఆగింది. అందులో వ్యక్తి నా వైపుకు ప్రశ్నార్థకంగా తిరిగాడు. ఆ కళ్లలో ఏదో దైన్యం ఉంది. ఆ వ్యక్తిలో ఏదో కోల్పోయిన భావన ఉంది. వయసు ముప్ఫయికి లోపే.

'ఎస్!' అన్నట్టు చూశాడు.

నా పరిస్థితి చెప్పాను.

"పదండి, కారు దగ్గరకి వెళ్లి చూద్దాం!" అన్నాడు. ఆ మాటలు లోతుల్లో ఉన్నట్టు ధ్వనించాయి. నాతో బయటకు వచ్చేముందు గోడమీద ఓ ఫోటోవైపు దీర్ఘంగా చూశాడు. అది ఓ అమ్మాయి ఫోటో.

'పదండి చూద్దాం!' అని వట్టి చేతులతో వస్తే ఏం జరుగుతుందీ? అని నా మనసు ఘోష.

ఇద్దరం కారు దగ్గరకి చేరాం.

అతడు డ్రైవింగ్ సీటులో కూర్చుని కీ తిప్పగానే అప్పటిదాకా వెగత జీవిలా పడుకున్న కారు ప్రాణం వచ్చినదానిలా గజగజలాడింది.

ఎయిర్‌పోర్టుకి చేరాలి అన్న హడావుడిలో ఉన్న నాకు కారు ఆగగానే ఎంత డీలా పడ్డానో, ఇప్పుడది స్టార్ట్ అవ్వగానే సంతోషం ఉప్పెనలా వచ్చింది.

పర్సులోంచి విజిటింగ్ కార్డు ఒకటి తీసి, "మీ సహాయం ఎన్నటికీ మరువలేను. మీరు ఎప్పుడైనా మా ఇంటికి రండి. మీకు ఏం కావాల్సినా చేయడానికి మా ఫాదర్ ఇన్‌ఫ్లుయెన్స్ కూడా

## ఎవరిని ముంచుతుంది?

'సముద్రం' సినిమాను జగపతిబాబు కోసమే తీశానని కృష్ణవంశీ అంటున్నాడు. "అలా అని ఈ సినిమాతో జగపతికి గొప్ప బ్రేక్ ఇస్తానని కాదు, మొత్తంమీద అతడిలోని నటుణ్ని పూర్తిస్థాయిలో చూపించాలని!" అంటున్నాడు. జగపతి కూడా ఇందుకోసం నిద్రాహారాలు మానేశాడని చెప్పాడు. అసలు సముద్రం అనే పేరులోనే గొప్ప ఆకర్షణ ఉందని, అది క్షణక్షణానికీ మారుతూ ఉంటుందని, ఓసారి భయంకరంగా, మరోసారి అందంగా, ఇంకో సారి బీభత్సంగా ఉంటుందనీ, జీవితం కూడా సముద్రం లాంటిదే కాబట్టి ఈ సినిమా జీవితాన్ని ప్రతిబింబిస్తుందని ఢంకా బజాయించాడు కృష్ణవంశీ.



ఈయనగారి 'సముద్రం' అధికవ్యయంతో అనుకున్న దానికన్నా ఎక్కువ ఖర్చుతో తీశారనీ, అటూ ఇటూ అయితే అటు ప్రేక్షకుల సంగతి ఎలా ఉన్నా, ఇటు నిర్మాత మాత్రం సముద్రంలో మునగక తప్పదనీ కృష్ణవంశీ స్టయిల్‌ను గమనిస్తున్న అతడి విమర్శకులు జోకులేస్తున్నారు.

సి.

ఉపయోగిస్తారు!" మామూలుగానే నా దర్పం నాకు తెలియకుండానే తొంగి చూసిందనుకుంటాను.

"నిజంగా సాయం చేస్తారా?" అన్నాడతను నా కళ్లల్లోకి కళ్లుపెట్టి చూస్తూ.

ఈసారి ఆ చూపుల్లో ధైర్యం లేదు. తనవైపు లాగేసుకుంటున్నట్లు .... తన మాటలకీ , చేతలకీ నేను బందీనయినట్టు ఫీలింగ్.

"ఆ, చేస్తాను!" అన్నాను ఆ వశీకరణానికి లోబడుతూ.

"నరసింహం అని ... మీకు పరిచయం ఉందనుకుంటాను. అతన్ని ఎలాగైనా వచ్చే ఆదివారం ఇక్కడికి తీసుకురావాలి!"

నా ప్రయత్నం లేకుండానే నా తల అంగీకారం సూచించింది.

నిజానికి దానికి నేను ఎందుకు అంగీకరించానో నాకిప్పటికీ అర్థం కాదు. పైగా నరసింహంతో నాకు పెద్ద పరిచయం లేదు. అయినా అలాంటి రోగ్‌తో నాకు పరిచయం ఏమిటి? వాడొట్టి ఆడపిచ్చిగాడు. రెండుమూడు సార్లు నా వెంటపడ్డాడు. గట్టి వార్నింగ్ ఇచ్చేసరికి నా జోలికి రాలేదు.

ఇప్పుడలాంటి వాడితోనే నేను ప్రణయం నటించాల్సి వస్తోంది నా ప్రమేయం లేకుండా.

రెండు రోజుల్లో నరసింహాన్ని పూర్తిగా నమ్మించాను. కవ్వించాను. నవ్వించాను.

ఇంత జరిగాక నరసింహం ఊరుకుంటాడా? తన కోరిక బయటపెట్టాడు.

నేను ఊరించి ... ఊరించి చెప్పాను నా అంగీకారం. ఎప్పుడో, ఎక్కడో కూడా నేనే చెప్పాను.

నరసింహాన్ని ఎక్కడికి, ఎప్పుడు తీసుకువెళ్తున్నానో మీకు ప్రత్యేకంగా చెప్పనవసరం లేదనుకుంటాను. ఇప్పుడక్కడికే నా తయారీ.

ఆ క్షణం రానే వచ్చింది.

అదే ఆదివారం .... అర్ధరాత్రికి అర్ధగంట ముందు...!

***

**నరసింహం చెప్పిన కథ**

నాకు తెల్సినవాళ్లు నన్ను పేరులోనే చదివేయచ్చు అంటారు. వాళ్లు ఏ ఉద్దేశంతో అన్నా నేను దాన్ని కాంప్లిమెంట్‌గానే తీసుకుంటాను. నన్ను దెయ్యంలా చూస్తారు. జనానికి ఆ మాత్రం భయం అవసరం నా దృష్టిలో. కేవలం మనిషిలానే మిగిలిపోతే నా స్పెషాలిటీ ఏమిటి? ఇంతవరకూ నేను అనుకున్నది ఏదీ సాధించకుండా వదలలేదు. ఏ విషయం అయినా నాదే పై చేయిగా ఉండాలనుకుంటాను. ఇంతవరకూ నా పట్టుదలకి పదునుపెట్టింది ఇద్దరే ఇద్దరు. ఆ ఇద్దరూ అమ్మాయిలే. అందమైన అమ్మాయిలు. అందులో ఒకరు ఎంత ప్రయత్నించినా లొంగిరాలేదు. చివరికి పెళ్లి చేసుకుంటానని మభ్యపెట్టినా సరే! 'అన్నయ్య ... అన్నయ్య' అంటూ ఒకటే నీలుగుడు. మంచితనంతో కానప్పుడు రాక్షసత్వమే. గెస్ట్‌హౌస్‌లో రెండుసార్లు తనివితీరా అనుభవించా. ఇంత జరిగాక కూడా దానికి పొగరు తగ్గలా. నన్నే కత్తితో పొడవటానికి వచ్చింది. గొంతు నులిమేశా. అది ఆత్మ హత్యగా ఉండటానికి పలుకుబడిని ఉపయోగించాను. దాని అన్నయ్య సంగతి కూడా అంతే!

ఈ విషయం అంతా ఎందుకు చెబుతున్నానంటే నేను కోరుకున్న ఆ రెండో వ్యక్తి కూడా నా వశం కాబోతోంది తనంతట తానే!

అదీ ఈ రాత్రే!

ఇంతకీ ఆ వ్యక్తి .... ఆ అందాల బొమ్మ పేరు ... సువర్చల!

***అసలు కథ***

దూరంగా కారులైట్లు చూడగానే ఆ బంగ్లాముందున్న వ్యక్తి కళ్లు వెలుగంతా మింగినట్టు ఒక్కసారి కక్కాయి.

"ఇటువైపు మీ బంగ్లా ఉందా?" ఆశ్చర్యం గొంతునిండా పోసుకుని అడిగాడు నరసింహం.

అవును, కాదు అన్నట్టు తల ఆడించింది సువర్చల.

కారు బంగ్లా ముందు ఆగింది.

"ఏమిటో అంతా ... అసహజంగా ఉందే ... ఇక్కడ మీ బంగ్లానా?" నరసింహం మాటలు గొంతులో ఉండగానే.

"అవును, నరసింహం! అంతా అసహజమే!"

కొండరాళ్లు దొర్లుతున్నట్టు, పెద్దపెద్ద ఇనుప శకలాలు ఒకదానికొకటి రాసుకుని ఢీకొట్టినట్టు ధ్వని!

కారులోంచి నరసింహం బయటకు విసిరివేయబడ్డాడు. నరసింహం కళ్లకి పరిచితమైన ఆకారం ముందు నిలిచింది. గొంతు మెలికబడుతుండగా ... "మనో.... మోను.... మనోహ..."

నరసింహం గొంతుని ఎదుట వ్యక్తి అదృశ్య హస్తాలతో నొక్కేస్తున్నట్టు విలవిలలాడిపోయాడు.

సువర్చలకి భయంతో స్పృహ తప్పింది.

***

ఏదో రొద .... ఎక్కడో వేకువ చప్పుడు.

గింగిరాలు తిరుగుతున్న తలని అదుపులోకి తెచ్చుకుని కళ్లు తెరిచింది సువర్చల. అంతే! భళ్లున వాంతి చేసుకుంది.

ఎదురుగా బంగ్లా లేదు!

ఓ చెట్టు మాత్రం ఉంది!

దానికి ఉరి వేసినట్టుగా మాంసఖండాలుగా, పేలికలుగా, ముద్దలు ముద్దలుగా వేలాడి ఉంది.

ఆమె కూడా అది నరసింహం శరీర శకలాలని గుర్తుపట్టలేదు. కాసేపటికి తెలివి తెచ్చుకుని ఒక్క గెంతులో కారు స్టార్ట్ చేసింది.

***


ఇప్పుడామె దేవుడిని, దెయ్యాలని చచ్చినట్టు నమ్ముతోంది. చచ్చినా నమ్ముతుంది!

***

**కొసమెరుపు**

సరదాగా ఓ మిస్టిక్ కథ రాయాలని స్టోరీ అంతా సిద్ధం చేసుకుని ఆ రాత్రంతా రాశాను. నేను రాసిన కథలో మనోహర్, నరసింహం, సువర్చల ఇంకా నా చుట్టూ తిరుగుతున్న ఫీలింగ్. ఈ కథలో సువర్చలను కూడా దెయ్యాన్ని చేస్తే ఎలా ఉంటుంది? అప్పటికే కథ రాసి రాసి అలసిపోయాను. సువర్చల దెయ్యం కావాలంటే ఏ ట్విస్టు పెట్టాలి? ఆలోచనల్లోనే నిద్రలోకి జారుకున్నాను. పొద్దున్న లేచి నిన్న రాత్రి నేను రాసిన కథని ఫెయిర్ చేయడానికి సిద్ధం అయ్యాను. కానీ రాత్రి నేను రాసిన కాగితాల్లో కథ లేదు. అవన్నీ తెల్లగా అసలు వాడనట్టే ఉన్నాయి. కథ ఎలా మిస్ అయినట్టు? ఎక్కడికి వెళ్లినట్టు? ఈ విషయాలు అడగడానికి ఇప్పుడు నేను మనోహర్‌ని పిలవాలి. ఇదుగో, అటే బయల్దేరుతున్నాను. అయినా నా పిచ్చిగానీ మనిషి రాసిన కథలు కనబడతాయి గానీ, నేను రాసినవి ఎలా కనిపిస్తాయి? ■

## రింకీ అంటే నాకిష్టం!



ఎవరో గొప్ప సినీతార చెప్పినమాట కాదిది. వర్ధమానతార ఆయేషాధర్కర్ అన్నమాట. సినీతారల పిల్లలు సినీతారలు కావటం మామూలీరంగంలో. కాని జర్నలిస్టు, కవయిత్రి-వీరి కుమార్తె నటి కావటం ఇక్కడి విశేషం. "తప్పకుండా ఏదో ఆశిస్తారు నానుంచి కూడా. అయినా గొప్పవారి పిల్లలుగా పుట్టటం కూడా తప్పేనేమో! రింకీ ఖన్నాను చూడండి. ఆమె తల్లిదండ్రులు పేరున్న నటీనటులు. అక్కకూడా మంచినటే. కాని రింకీ మాత్రం తనకంటూ ఓ స్థానాన్ని తన ప్రతిభవల్ల ఏర్పరచుకుంది. అందుకే నాకు రింకీ అంటే చాలా ఇష్టం" అంటూంది ఆయేషా. మొదట్లో ఓ ఫ్రెంచి చిత్రంలోనూ, ఆ తరువాత 'టెర్రరిస్ట్, సిటీ ఆఫ్ జాయ్, సాజ్' చిత్రాల్లో చేసిన ఆయేషా మరిన్ని మంచి చిత్రాల్లో నటించాలని ఆశిస్తూంది. చూద్దాం ఎంతదాకా నిలబడు తుందో పోటీని తట్టుకుని!

ఎస్.